దక్షిణ ఆసియాలోనే 'ఎస్కీ' కీలకం



కేలండర్‌ను ఆవిష్కరించిన కౌన్సిల్ సభ్యుడు చాడేగౌడ, డైరెక్టర్ రామేశ్వరరావు తదితరులు

రాయదుర్గం: దక్షిణ ఆసియాలోనే ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాకు మంచి గుర్తింపు ఉందని ఎస్కీ బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ ఎం చాడేగౌడ పేర్కొన్నారు. 2024–25 సంవత్సరం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించే శిక్షణా కార్యక్రమాల వార్షిక కేలండర్‌ను బుధవారం ఆయన డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్కీలో 12 శాఖలు ఉన్నాయన్నారు. గత ఏడాది సుమారు ఏడు వేల మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ పురోగతిలో సాధికారత, ప్రపంచంలోని సవాళ్ళను పరిష్కరించడానికి అభ్యర్థులను సన్నద్ధం చేయడం, నిరంతరం అభివృద్ధి చెందుతున్న అధునాతన ఇంజనీరింగ్, సాంకేతిక రంగాల్లో శిక్షణ కోసం వచ్చిన అభ్యర్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడంలో ఎస్కీ కీలకపాత్ర పోషిస్తుందన్నారు కార్యక్రమంలో కాలేజ్ చీఫ్ లక్ష్మీకాంత రావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పల్స్‌హార్ట్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



వైద్యులతో శస్త్ర చికిత్స చేయించుకున్న మహిళ, కుటుంబ సభ్యులు

హఫీజ్‌పేట్: దేశంలో మొట్టమొదటిసారిగా మినిమల్లీ ఇన్వాసివ్ సర్జరీ చేశామని పల్స్‌హార్ట్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ముఖర్జీ పేర్కొన్నారు. బుధవారం మియాపూర్ మాతృశ్రీనగర్‌లోని పల్స్‌హార్ట్ ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓపెన్‌హార్ట్ సర్జరీ లేకుండా రోగికి చికిత్స చేశామన్నారు. మినిమల్లీ ఇన్వాసివ్ సర్జరీతో కార్సినోయిడ్ గుండె జబ్బుతో బాధపడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 59 సంవత్సరాల మహిళకు కుడివైపు గుండె కవాటాలు ట్రైకస్పిడ్, పల్మనరీ వాల్వ్‌లు రెండు తీవ్రంగా డామేజ్ అయ్యాయని దీంతో శస్త్ర చికిత్స లేకుండా రోగికి ట్రాన్స్‌కాథెటర్ పల్మనరీ వాల్వ్ రీప్లేస్‌మెంట్, ట్రైకస్పిడ్ వాల్వ్ రీప్లేస్‌మెంట్‌ను నిర్వహించామన్నారు. టీవీపీఆర్ అనేది భారతదేశంలోని ఎంపిక చేయబడిన కొన్ని ఆస్పత్రులలో మాత్రమే చేయడానికి అవకాశం ఉందని ,ఇది చాలా అరుదైన ప్రక్రియ అని అన్నారు. రోగిలో ఈ రెండు విధానాలను ఒకేసారి నిర్వహించడం అనేది చాలా ప్రత్యేకమైందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నాలుగు ప్రాంతాలలో ఇలాంటి చికిత్స నిర్వహించారని, మన దేశంలో మొట్ట మొదటి చికిత్స చేశామన్నారు. ప్రస్తుతం రోగి కోలుకుని నడుస్తుందన్నారు. శస్త్ర చికిత్సలో పల్స్ హార్ట్ ఆసుపత్రి వైద్యులు మొవ్వా శ్రీనివాస్, వినోద్ ఉన్ని, క్రాంతి కుమార్, వికాస్ శుక్లా, వంశీ, నంద కిషోర్, చంద్రేష్, రాజేష్, జయ రంగనాథ్, శ్రీనివాస్, అభిషేక్ రాజ్ పోపట్ ఉన్నారని అన్నారు.

ఇంకుడు గుంతల ఏర్పాటు అవశ్యం



కార్యక్రమంలో పాల్గొన్న డీజీఎం రవి

మూసాపేట: ఇంకుడు గుంతల వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని వాటర్ వర్క్స్ డీజీఎం రవి అన్నారు. బుధవారం మూసాపేట సెక్షన్ పరిధిలో ఇంకుడు గుంతల ఏర్పాటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలు కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రౌండ్ వాటర్ పూర్తిగా తగ్గిపోతుందని, నీరు వృధా చేయకూడదన్నారు. ప్రతి కాలనీలో, ఇళ్లల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ సలోమి, విలియం ప్రకాష్, డివిజన్ ఇన్‌చార్జి మొగులయ్య, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల వైద్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం



రాయదుర్గం: నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని స్టార్ ఆస్పత్రిలో బుధవారం అత్యాధునిక ఇంటర్వెన్షనల్ పల్మోనాలజీ సూట్ లోగోను సీనియర్ పల్మోనాలజిస్ట్ డాక్టర్ ఆర్ విజయ్‌కుమార్, ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్ మన్నం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊపిరితిత్తులు, వాయుమార్గాల వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో విప్లవాత్మక మార్పులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమీకృతం చేస్తూ ఊపిరితిత్తుల వైద్యంలో ఈ గ్రౌండ్ బ్రేకింగ్ సదుపాయం ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందన్నారు. ఈ విధానం ద్వారా స్వల్ప ప్రమాదం, ఖచ్చితమైన ప్రయోజనాలను నిర్ధారిస్తుందన్నారు. డాక్టర్ అనురాధ, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్‌టీసీ బస్.. ట్రాఫిక్ జామ్



మూసాపేట: కూకట్‌పల్లి వివేకానందనగర్ కమాన్ వద్ద బుధవారం ఆర్‌టీసీ బస్సు మొరాయించటంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. కూకట్‌పల్లి డిపోకు చెందిన ఆర్‌టిసి బస్ మెహదీపట్నం నుంచి జగద్గిరిగుట్టకు వెళుతోంది. బస్ రేడియేటర్ నుంచి పొగలు వచ్చి బస్ ఆగిపోయింది. రోడ్డుపై ఆగిపోవటంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సిబ్బంది వచ్చి రిపేర్ చేసి బస్‌ను డిపోకు తీసుకెళ్లారు. ప్రయాణికులను వేరే బస్‌లో పంపించారు.

స్పీడుకి చెక్..



రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రేడియల్ రోడ్లపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు శ్రీకారం చుట్టారు. గతంలో శేరిలింగంపల్లి–గోపన్‌పల్లి నుంచి తెల్లాపూర్ మీదగా కొల్లూర్ రింగ్ రోడ్డు వరకు, శేరిలింగంపల్లి నల్లగండ్ల నుంచి తెల్లాపూర్ ఇందిరానగర్ మీదగా మైహోం నుంచి కొల్లూర్ రింగ్‌రోడ్డు వరకు రేడియల్ రోడ్లను అభివృద్ధి చేశారు. రోడ్డు విశాలంగా ఉండడంతో వాహనదారులు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తుండడంతో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. వీటి కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయారు. రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరగడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. దాంతో అధికారులు రేడియల్ రోడ్లపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు పలుచోట్ల రోడ్లపై బారికేడ్లను ఏర్పాటు చేశారు. ప్రధానంగా ఇందిరానగర్ సర్కిల్ వద్ద స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటుచేశారు. అలాగే రోడ్లపై విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఇక అధికారులు నిత్యం తనిఖీలు చేస్తున్నారు.

అవగాహన కార్యక్రమాలు..

ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ అధికారులు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పలు లేబర్ క్యాంప్‌లలో సైతం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు.

స్పీడ్‌గన్‌తో..

ప్రమాదాలకు కారణం మితిమీరిన వేగమేనని గుర్తించిన అధికారులు దానికి బ్రేక్ వేయడం కోసం ఎంత వేగంగా వెళ్ళాలో సూచించే హెచ్చరిక బోర్డులను రోడ్డుకు ఇరు పక్కలా ఏర్పాటు చేశారు. బోర్డులో సూచించిన వేగంకన్నా ఎక్కువ వేగంతో వెళ్ళే వాహనాలను స్పీడ్‌గన్‌తో గుర్తించి చలాన్లు విధిస్తున్నారు.

రోడ్లపై విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి



రాత్రి సమయంలో రోడ్లపై విద్యుత్‌దీపాలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. రోడ్ల ప్రమాదాలపై అందరికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. –సురేష్, తెల్లాపూర్



జనప్రియ అపార్ట్‌మెంట్స్ వద్ద ఉన్న నాలా పైప్‌లైన్ ద్వారా వస్తున్న వరద నీరు



హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ అపార్ట్‌మెంట్స్ వద్ద నాలాకు అడ్డంగా ఉన్న ప్రహరీ గోడ

నాలా విస్త'రణం'

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్‌గా.. ఓపెన్‌నాలా

- నాలాకు ఇరువైపులా అపార్ట్‌మెంట్ల నిర్మాణం
- అధికారుల నిర్లక్ష్యంతో పనుల్లో అలసత్వం

హఫీజ్‌పేట్: నాలా విస్తరణ పనులు పూర్తికాక ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కాయిదమ్మకుంట చెరువు నుంచి గురునాథం చెరువు వరకు ఓపెన్ నాలా ఉండేది. ఇప్పుడు నాలా ఆనవాలు లేకుండా పైపుల ద్వారా వరదనీరు వెళుతోంది. ఓపెన్ నాలా కాస్త పూర్తిగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నాలాగామారిపోయింది. కాయిదమ్మకుంట చెరువు నుంచి గురునాథం చెరువు వరకు వెళుతున్న నాలా జనప్రియనగర్, జనప్రియ అపార్ట్‌మెంట్స్ 1,4 డాల్ఫిన్ టవర్స్ మీదుగా సితార హోటల్ జాతీయ రహదారి నుంచి గురునాథం చెరువులోకి కలుస్తుంది. కానీ ఈ మధ్యలో హేమదుర్గ అపార్ట్‌మెంట్స్‌తో పాటు వారికి కావాల్సిన పార్కులు నిర్మించారు. ఏకంగా అపార్ట్‌మెంట్స్ చుటూ ప్రహరీ నిర్మించి లోపలకు ఎవరూ రాకుండా సెక్యూరిటీ ఏర్పాటు చేసుకున్నారు. ఎప్పుడైనా వరదలు వస్తే జనప్రియ అపార్ట్‌మెంట్స్ ప్రజలు వరదల్లో మునగాల్సిందేనా అని వారు వాపోతున్నారు. గత సంవత్సరం వచ్చిన వరదలతో జనప్రియ అపార్ట్‌మెంట్స్ ఫేజ్ 5లోని ఇళ్లలోకి నీరు చేరి తీవ్ర ఆస్తినష్టం కలిగింది. ఇప్పటికైన సంబంధిత అధికారులు నాలాను పరిశీలించి వరద ముంపు నుంచి కాపాడాలని కోరుతున్నారు.

- రూ. 8 కోట్లతో నాలా విస్తరణకు నిధులు కేటాయించారు. కానీ సగం వరకు పూర్తి అయ్యాయి.
- కాయిదమ్మకుంట నుంచి జనప్రియనగర్ మీదుగా జనప్రియ అపార్ట్‌మెంట్ ఫేజ్ 1 వరకు నాలా పనులు పూర్తి చేశారు. కానీ అక్కడ నుంచి హేమదుర్గ అపార్ట్‌మెంట్ నుంచి ముందుకు సాగలేదు.
- హేమదుర్గ అపార్ట్‌మెంట్స్‌లో నుంచి వెళ్లిన నాలా జాతీయ రహదారి సితార హోటల్ వద్ద చిన్న పైపుల ద్వారా బయటకు వెళ్లేలా చేశారు.
- వానాకాలం అయితే హేమదుర్గ అపార్ట్‌మెంట్స్‌తో పాటు జనప్రియ అపార్ట్‌మెంట్స్‌ను వరద భయం వెంటాడుతోంది.
- వరద ముంపునకు కేరాఫ్‌గా హఫీజ్‌పేట్ జనప్రియ అపార్ట్‌మెంట్స్ మారాయి.
- అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

నాలా విస్తరణ కేవలం అధికారుల నిర్లక్ష్యం



నాలాకు ఇరువైపులా అపార్ట్‌మెంట్ల నిర్మాణం జరిగింది. వరద వచ్చినప్పుడు నాలా వల్ల జనప్రియనగర్ అపార్ట్‌మెంట్స్ పూర్తిగా ముంపునకు గురవు తున్నాయి. నిధులు ఉన్నా పనులు ముందుకు సాగడం లేదు. ఇది కేవలం అధికారుల నిర్లక్ష్యమే. – వెంకట సుబ్బయ్య, జనప్రియనగర్

ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలి



నాలా విస్తరణ పనులు హేమదుర్గ అపార్ట్‌మెంట్ నుంచి జాతీయ రహదారి వరకు అసంపూర్తిగా ఉన్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ప్రత్యేక దృష్టి సారించి నాలా విస్తరణ పనులు ప్రారంభం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి. – పునారాం చౌదరి, జనప్రియ అపార్ట్‌మెంట్

రేపటినుంచి హెచ్‌సీయూలో ఐఎస్ఎల్ఈ సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో 64వ వార్షిక ఇండియన్ సొసైటీ ఆఫ్ లేబర్ ఎకనామిక్స్ (ఐఎస్ఎల్ఈ) సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు మూడు రోజుల పాటు పేపర్ ప్రజెంటేషన్లు, ఆరు ప్యానెలిస్ట్ లెక్చర్‌లు, మూడు థీమ్‌ల చుట్టూ పదహారు సమాంతర ప్యానెల్ చర్చలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తారు.ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి 1200 మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటారు. అందులో ఆర్‌బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ సి రంగరాజన్ ప్రారంభోపన్యాసంతో సదస్సును ప్రారంభిస్తారు. ఐఎల్ఏసీఈకి చెందిన ప్రొఫెసర్ మైత్రీష్ ఘటక్, జేఎన్‌యూ ప్రొఫెసర్ దీపక్ నయ్యర్, ఐఎల్ఓలోని సీనియర్ ఎకనామిస్ట్ ఉమారాణి, ఉపేంద్రబాక్సీ, లార్డ్ మేఘనాద్ దేశాయ్ వంటి ఆర్థికవేత్తలు, విద్యావేత్తలు పాల్గొంటారు.

హెచ్‌సీయూలో సమ్మర్ స్కూల్ నిర్వహణ

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు రూ.17.76 లక్షలు మంజూరు

రాయదుర్గం: సైన్స్ అకాడమీస్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు సమ్మర్ స్కూల్ నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు అయ్యాయి .ఈ ప్రోగ్రామ్ కింద నిరుపేద విద్యార్థులకు సమ్మర్‌స్కూల్ నిర్వహించడానికి హెచ్‌సీయూలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు రూ.17.76 లక్షలు మంజూరు అయ్యాయి. వేసవి పాఠశాలలను నిర్వహించడం ద్వారా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది. ఈ కార్యక్రమానికి డైరెక్టర్‌గా ప్రొఫెసర్ సెంథిల్ కుమార్, సమన్వయకర్తగా ప్రొ.సురేష్ వ్యవహరిస్తారు.

25 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.... సోమ, మంగళవారాల్లో నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్‌లో 25 మందిని పట్టుబడ్డారని వారిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి 25 మందికి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

ఒకరికి పాజిటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయి.బుధవారం 11 మందికి కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా, ఒకరికి పాజిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు.అదేవిధంగా 08 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

పింఛన్ పత్రాలు అందజేత

పటాన్‌చెరు టౌన్: పదవీ విరమణ పొందిన నెలలోపు చందాదారులకి పింఛన్ పత్రాలు అందజేస్తున్నట్లు పీఎఫ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ కొండాపూర్‌లోని జయభేరి ఆటోమోటివ్స్ వర్క్‌షాప్‌లో నిర్వహించిన నిధి ఆప్కే నికత్ 2.0 కార్యక్రమంలో భాగంగా 9 మందికి పింఛన్ పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా పీఎఫ్‌లోని ఈడీ ఎల్ఐ ఇన్సూరెన్స్ బెనిఫిట్స్ గురించి, ఈ నామినేషన్ ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర్ రావు, మన్సూర్ బాషా, మురళి, రాజగోపాల్, వెంకటేష్, జయభేరి ఆటోమోటివ్స్ నుండి నళిని, కాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు బాధ్యతగా విధులు నిర్వహించాలి

కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: పారిశుద్ధ్య కార్మికులు తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని, కేటాయించిన కాలనీలలో ఎప్పటికప్పుడు రోడ్లను శుభ్రంగా ఉంచాలని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. పారిశుద్ధ్యం పనులు సరిగ్గా జరగడం లేదని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా బుధవారం ఉదయం కార్పొరేటర్ కాలనీలలో పర్యటించి చెత్త సేకరణ తదితరాలను పరిశీలించారు.అనంతరం ఆల్విన్ కాలనీ, వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా పారిశుద్ధ్య పనులు చేయించారు. అనంతరం ఆయన మెట్టు కుమార్ మాట్లాడుతూ కాలనీల నుండి ఫిర్యాదులు రాకూడదని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 20, పచ్చిమిర్చి 70, బెండ 50, కాకర 60, దొండ 40, దోస 40, ఆలు 30, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 70, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 60, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 150, వెల్లుల్లి 250.

ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధి ఆదిత్యనగర్‌లోని శ్రీ సాయి గణేష్ ఆలయ పునఃనిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరతగతిన ఆలయ పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, ఆదిత్యనగర్ బస్తీ అసోసియేషన్ అధ్యక్షులు ఖాసీం, నాయకులు మియాన్ పటేల్, కాజా, ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు, ఏడుకొండలు, రామచంద్రమూర్తి, నాగార్జున, విజయ్, నాని, సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో 'సేవ్ లడఖ్ సాలిడారిటీ'

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) ఆధ్వర్యంలో 'సేవ్ లడక్ సాలిడారిటీ ' పేరిట కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం రాత్రి క్యాంపస్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ ప్రతినిధి ధీరజ్ సంఘోజి మాట్లాడుతూ లడక్‌లో నివసించే వారి డిమాండ్‌లకు ఎన్ఎస్‌యూఐ హెచ్‌సీయూ శాఖ మద్దతు ఇస్తుందన్నారు. ఎన్ఎస్‌యూఐ హెచ్‌సీయూ కార్యదర్శి లియాకత్ అలీ మాట్లాడుతూ లడఖ్ ప్రజలకు మద్దతుగా నిలబడతామన్నారు.

బస్తీ మీటింగ్

శేరిలింగంపల్లి: పరిసరాల శుభ్రతలో మహిళలు భాగస్వాములు కావాలని శేరిలింగంపల్లి సర్కిల్ ఏఎంఅండ్‌హెచ్‌ఓ నగేష్ నాయక్ తెలిపారు. నల్లగండ్ల వీకర్ సెక్షన్ కాలనీలో జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో బస్తీ మీటింగ్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ నాయక్ మాట్లాడుతూ బస్తీలు, కాలనీల్లో చెత్తను నేరుగా స్వచ్ఛ ఆటోలకే అందించి జీహెచ్ఎంసీకి సహకరించాలని కోరారు. స్వచ్ఛ ఆటోలు రాకపోతే తమకు సమాచారం అందించాలన్నారు. రోడ్లపై చెత్త వేయరాదని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ భరత్, సీఓ శ్రీకాంత్, డ్వాక్రా మహిళలు, శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్స్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో చెత్తకుప్పలు



మియాపూర్: దీప్తిశ్రీనగర్ కాలనీలో రోడ్ల పక్కన ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం దర్శనమిస్తుంది. కాలనీ రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి.అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.